ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | 5





మండపేటలో వేగుళ్లకు కేక్ తినిపిస్తున్న నాయకులు



నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం | వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట | జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట | బండారు సత్యానందరావు, కొత్తపేట | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి | దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), ముమ్మిడివరం | పంతం నానాజీ, కాకినాడ రూరల్ | ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం సిటీ | బత్తుల బలరామకృష్ణ, రాజానగరం | యనమల దివ్య, తుని | మహాసేన రాజేశ్, గన్నవరం



పెద్దాపురంలో నిలిచిన అభివృద్ధి కొనసాగిస్తా : చినరాజప్ప

రెండు దఫాలు పెద్దాపురం నియోజకవర్గం నుంచి గెలుపొందా. మొదటి దఫాలో పెద్దాపురం నియోజకవర్గాన్ని వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశా. రెండో దఫా గెలుపొందినా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. మూడో దఫా తిరిగి పెద్దాపురం నుంచే పోటీ చేసే అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది. అదే రేపటి నుంచి ప్రచారంలో ప్రజలకు వివరించి గెలుపు సునాయాసం చేసుకుంటా.

మండపేట సీటు బాబు, పవన్‌కు బహుమతిగా ఇస్తా : వేగుళ్ల

మూడోసారి మండపేట నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీటును చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు బహుమతిగా ఇస్తా. మొదటి జాబితాలో తనకు చోటు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు.తనను ఆదరించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా.

జగ్గంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : జ్యోతుల నెహ్రూ

గతేడాది ఫిబ్రవరిలోనే చంద్రబాబు జగ్గంపేట వచ్చిన సందర్భంలోనే నన్ను అభ్యర్థిగా ప్రకటించారు. పవన్‌కల్యాణ్ ఆశీస్సులతో జగ్గంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా.

8వ సారి కొత్తపేట నుంచి పోటీ : బండారు సత్యానందరావు

టీడీపీ కొత్తపేట అసెంబ్లీ సీటు కేటాయించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు రుణపడి ఉంటా. 1989 నుంచి ఇప్పటి వరకూ 7 సార్లు అసెంబ్లీకి పోటీ చేసి మూడు సార్లు గెలిచా. ఇప్పుడు 8వ సారి ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నా. తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణులతో కలిసి ఒక ప్రణాళికతో ముందుకు వెళతా. రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ అరాచకాలకు, అవినీతికి ప్రజలు ముగింపు పలికేందుకు ఎదురుచూస్తున్నారు. ప్రజలంతా టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

అనపర్తిలో జనసేన సహకారంతో విజయం సాధిస్తా : నల్లమిల్లి

తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.. అనపర్తిలో జనసేన సహకారంతో విజయం సాధిస్తా.రామకృష్ణారెడ్డి విజయానికి సంపూర్ణ మద్దతు అందజేస్తున్నామని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు.

ముమ్మిడివరంలో విజయం సాధిస్తా : దాట్ల

నాపై నమ్మకంతోనే టీడీపీ ముమ్మిడివరం టిక్కెట్ కేటాయించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళతా. టీడీపీ, జనసేన నాయకులతో పనిచేసి విజయం సాధిస్తా.

కాకినాడ రూరల్‌లో సమన్వయంతో ముందుకు : పంతం నానాజీ

నాపై నమ్మకంతో కాకినాడ రూరల్ సీటును ఖరారు చేసిన పవన్‌కల్యాణ్, చంద్రబాబుకి కృతజ్ఞతలు.టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళతాం.నియోజకవర్గంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కృషి చేస్తా. కాగా పొత్తులో టిక్కెట్ సాధించిన నానాజీని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీసత్యనారాయణ దంపతులు అభినందించారు. పార్టీ ఆదేశాల మేరకు సహకరిస్తామన్నారు.

రాజమహేంద్రవరాన్ని టీడీపీ కంచుకోటగా చేస్తా : ఆదిరెడ్డి వాసు

చంద్రన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. ఈ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ కాబోతుంది. భరత్ కాదు కాదా అటువంటి వాళ్ళు వందమంది ఉన్నా వైసీపీకి డిపాజిట్లు కూడా రావు. రాజమహేంద్రవరాన్ని టీడీపీ కంచుకోటగా మారుస్తా. మాపై నమ్మకంతో ఈ రోజు నాకు సీటు ఇచ్చిన చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.

రాజానగరంలో.. జన సైనికుడినే : బత్తుల బలరామకృష్ణ

జనసేనలో ఒక సామాన్య జనసైనికుడిగా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశా. నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలను పవన్‌కల్యాణ్ భుజాన ఎత్తుకుని మోస్తారు.నా విషయంలో అదే రుజువైంది.చంద్రబాబు, పవన్ రాజానగరం నియోజకవర్గానికి తన పేరు ప్రకటించడం ఆనందంగా ఉంది. రేపటి నుంచే ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళతా.

తుని నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతా : యనమల దివ్య

పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. నా తండ్రి యనమల రామకృష్ణుడు అడుగుజాడల్లో ముందుకెళతా.తుని నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతా. అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టి తుని నియోజకవర్గ ప్రజలకి సేవలందిస్తా.

గన్నవరం టిక్కెట్ ఊహించలేదు : మహాసేన రాజేశ్

ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని.. ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడతానని కలలో కూడా అనుకోలేదు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన పి.గన్నవరం నియోజకవర్గానికి తనను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. కలలో కూడా ఊహించని అవకాశం. సంతోషంగా ఉంది.18 మంది దళితులకు మొదటి జాబితాలోనే సీట్లు ఇచ్చి చంద్రబాబు తన గొప్పతనం చాటుకున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం సామాన్యులకు ఇవ్వడం ఎంత గొప్ప విషయం. బడుగు బలహీన వర్గాలను ద్వేషించే జగన్మోహన్ రెడ్డిని ఓడించి 2024లో టీడీపీ, జనసేన జెండాను రెపరెపలాడిద్దాం. కాగా పొత్తు ధర్మంలో భాగంగా ఉమ్మడి అభ్యర్థి ఎవరైనప్పటికీ వారి విజయానికి కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ అన్నారు.



సామర్లకోటలో నిమ్మకాయల చినరాజప్పకు గజమాలతో అభినందన

(కాకినాడ - ఆంధ్రజ్యోతి) :

అసెంబ్లీ ఎన్నికల రణక్షేత్రంలో ఉమ్మడి తూర్పు గోదావరిలో బరిలోకి దిగనున్న అభ్యర్థుల జాబితాను టీడీపీ,జనసేన పార్టీలు ప్రకటించాయి. కొంత కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న జాబితాను ఎట్టకేలకు శనివారం ఉదయం అధికారికంగా వెల్లడించాయి.రకరకాల వడపోతలు, మదింపుల అనంతరం గెలుపుగుర్రాలను గుర్తించి సీట్లను ఖరారు చేశాయి.తొలివిడత జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మొత్తం 11 మంది అభ్యర్థులను ప్రకటించాయి. ఇందులో తొమ్మిది స్థానాల్లో టీడీపీ, రెండు చోట్ల జనసేన తమ అభ్యర్థుల పేర్లను వెల్లడించాయి. టీడీపీ ప్రకటించిన తొమ్మిది మంది అభ్యర్థుల్లో మండపేట, పెద్దాపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేగుళ్ల, చినరాజప్పకు టికెట్లు ఖరారు చేశారు.జగ్గంపేట,ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తిలో మార్పులేవీ లేకుండా ప్రస్తుత ఇన్‌చార్జులైన నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు సీట్లు ప్రకటించారు. తుని, రాజమహేంద్రవరం సిటీ, పిగన్నవరం నియోజకవర్గాలకు పూర్తిగా కొత్త ముఖాలను సైకిల్ పార్టీ బరిలో దించింది.జనసేన ప్రకటించిన రెండు సీట్లలో రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ తొలిసారి పోటీ చేస్తున్నారు.ఇంకా 8 సీట్లలో అభ్యర్థుల ప్రకటన వాయిదా పడింది.రాజమహేంద్రవరం రూరల్ స్థానం దాదాపు టీడీపీకే ఖాయమైంది. రాజోలు నుంచి జనసేన పోటీ చేయనుంది.ఇంకా ఆరు సీట్లలో రంపచోడవరం మినహా మిగిలిన ఐదులో రెండు స్థానాల్లో జనసేన బరిలో దిగే అవకాశం ఉంది.

ఆచితూచి.. బేరీజు వేసి...

రాబోయే ఎన్నికల్లో వైసీపీ డబ్బు, మద్యం, అధికార బలంతో బరిలోకి దిగడానికి సన్నాహాలు చేసిన నేపథ్యంలో అధికార పార్టీని బలంగా ఢీకొని విజయబావుటా ఎగురవేసే సత్తా, సామర్థ్యం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడానికి టీడీపీ, జనసేన పార్టీలు సుదీర్ఘ కసరత్తు చేశాయి.దీనిలో భాగంగా ప్రకటించబోయే అభ్యర్థి శక్తిసామర్థ్యాలతో పాటు ప్రజామోదం ఉండేలా పలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ఒకపక్క అధికార వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులను ఇప్పటికే ప్రకటించడంతో టీడీపీ కూటమిపై ఒత్తిడి పెరిగింది. అభ్యర్థులను ఇంకా ప్రకటించకపోవడంతో కొంత టెన్షన్ నెలకొంది. అయినా ఎక్కడా ఒత్తిడికి లోనవకుండా టీడీపీ తన అభ్యర్థులపై అన్నిరకాల మదింపులు చేసి గెలుపు గుర్రాలు అని నిర్ధారించుకుని ఎట్టకేలకు శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 9 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇం దులో కాకినాడ పార్లమెంట్ పరిధిలో తుని, జగ్గంపేట, పెద్దాపురం సీట్లను, అమలాపురం పార్లమెంట్ స్థానం పరిధిలో ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట సీట్లను,రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానం పరిధిలో అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ టికెట్లను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ తొమ్మిది మందిలో మండపేట, పెద్దాపురం స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, చినరాజప్పకు మళ్లీ సీట్లు ఖాయం చేశారు. జగ్గంపేట నుంచి జ్యోతుల నెహ్రూ, ముమ్మిడివరం దాట్ల సుబ్బరాజు, కొత్తపేట బండారు సత్యానందం, అనపర్తి నుంచి రామకృష్ణారెడ్డికి తిరిగి సీట్లు ఖరారయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న వీరంతా మాజీ ఎమ్మెల్యేలే. గత ఎన్నికల్లో వీరంతా పోటీ చేశారు. ఇదిలా ఉంటే తుని సీటును యనమల రామకృష్ణుడు తనయ దివ్యకు ఖాయం చేశారు. గతేడాది ఇక్కడున్న ఇన్‌చార్జి యనమల కృష్ణుడుని తప్పించి ఆ స్థానంలో దివ్యను దించారు. పూర్తిగా ఈమె రాజకీయాలకు కొత్త. తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ స్థానంలో ఆమె భర్త ఆదిరెడ్డి వాసుకు సీటు ప్రకటించారు. ఈయన కూడా తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గడచిన అయిదేళ్ల నుంచీ ఈయన నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఈ దఫా తానే బరిలోకి దిగుతానని అధిష్ఠానాన్ని ఒప్పించి సీటు తెచ్చుకున్నారు. అమలాపురం పార్లమెంట్ స్థానం పరిధిలో పి.గన్నవరం సీటును మహాసేన రాజేష్‌కు ఖరారు చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఈయన రెండేళ్ల కిందట టీడీపీలో చేరారు. అధికార పార్టీ అక్రమాలు, అరాచకాలపై పోరాడతారనే పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం సీటు కేటాయించారు. వాస్తవానికి ఈ నియోజకవర్గానికి గడచిన మూడేళ్లగా పూర్తిస్థాయి ఇన్‌చార్జి లేరు. ఈ నేపథ్యంలో టికెట్లు ఆశిస్తోన్న నేతలతో పార్టీ సమన్వయ కమిటీని నియమించింది.అయితే వీరి బలాబలాలపై ఐవీఆర్ఎస్ విధానంలో టీడీపీ సర్వే చేపట్టింది. అందులో భాగంగానే రాజేష్‌కు సీటు ఖాయం చేసింది. అయితే టీడీపీ ఆశావహులు కొందరు రాజేష్‌కు టిక్కెట్ ఇవ్వడంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోపక్క జనసేన ఇద్దరు అభ్యర్థులను ప్రకటిం చింది. కాకినాడ రూరల్ నుంచి అందరూ ఊహించినట్టుగానే పంతం నానాజీ పేరును పవన్ ప్రకటిం చారు. ఈ సీటు జనసేనకు ఇచ్చే ఉద్దేశంతో టీడీపీ కూడా ఇక్కడ ఆశావహులకు ముందే విషయాన్ని వెల్లడించి జనసేనకు సహకరించేలా కొన్నేళ్ల కిందటే సంసిద్ధులను చేసింది. రెండో సీటుకు రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ పేరును ఖరారు చేశారు. ఈ సీటు కూడా జనసేనకు ఇవ్వడానికి టీడీపీ ముందే సిద్ధమైంది.ఈ నేపథ్యంలో రాజానగరం నుంచి తాము పోటీచేస్తున్నట్టు ఇప్పటికే జనసేన ప్రకటించింది.ఒకరకంగా చెప్పాలంటే శనివారం ప్రకటించిన ఉమ్మడి జాబితా అందరికీ పూర్తి ఆమోదయోగ్యమనే చెప్పాలి. మరోపక్క టిక్కెట్ల వెల్లడి సమయంలో చంద్రబాబు మాట్లాడుతూ తొలి విడతలో ప్రకటించిన అభ్యర్థుల విషయంలో ఎప్పుడూ లేనంత భారీ కసరత్తు చేశామని, నియో జకవర్గాల్లో వేలాది మంది ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టి గెలుపు గుర్రాలుగా భావించాకే పేర్లను ప్రకటిస్తున్నామని వివరించారు.

- ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల వెల్లడి
- టీడీపీ 9, జనసేన 2
- ఇద్దరు సిట్టింగ్‌లు, నలుగురు మాజీలు
- బరిలో నలుగురు కొత్తవారు
- కాకినాడ రూరల్‌కు నానాజీ
- 8 సీట్లలో అభ్యర్థుల ప్రకటన వాయిదా
- సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు
- రాజమహేంద్రవరం రూరల్‌లో ఉత్కంఠ
- మరో 3 స్థానాల్లో జనసేన పోటీ

త్వరలో ఆ సీట్లలోను...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 సీట్లకుగాను శనివారం 11 చోట్ల అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. ఇంకా ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది తేలాల్సి ఉంది. అయితే వీటిలో రాజోలు సీటు ఇప్పటికే జనసేనకు ఖాయమైంది. ఇక్కడి నుంచి అభ్యర్థి ఎవరనేది పవన్ కల్యాణ్ రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌కు టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జన సేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ పడుతున్నారు.సీటు విషయంలో కొంత తర్జనభర్జన కొనసాగుతోంది. ప్రత్తిపాడు, పిఠాపురం, అమలాపురం, రామచంద్రపురం స్థానాల విషయంలో ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు చర్చలు కొనసాగుతున్నాయి. వీటిలో రెండు చోట్ల పోటీ చేయాలని జనసేన భావిస్తున్నట్టు చెబుతున్నారు.ఇదే విషయమై పవన్ మాట్లా డుతూ జనసేన పోటీ చేసే స్థానాలపై రెండు రోజుల్లో ప్రకటన చేస్తామని పేర్కొన్నారు.త ద్వారా ఆ సీట్లు ఏవనేదానిపై స్పష్టత రానుంది.ఆ తర్వాత మిగిలిన సీట్లలో టీడీపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నారు.కాకినాడ సిటీ, రంప చోడవరం సీట్లలో టీడీపీయే బరిలోకి దిగనుంది.

వైసీపీ గుండెల్లో రైళ్లు..

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ సీట్లకు అభ్యర్థుల ఎంపికపై అధికార వైసీపీ ఆపసోపాలు పడుతోంది. ఇప్పటి వరకు ఐదు విడతల్లో జాబితాలు విడుదల చేసినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సగం సీట్లలో కూడా అభ్యర్థులను ప్రకటించలేకపోయింది. కానీ టీడీపీ, జనసేనలు కాస్త ఆలస్యమైనా ఒకేసారి సగానికిపైగా స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి స్పీడ్ పెంచాయి.దీంతో ఇప్పుడు వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో అలజడి రేగుతుందని భావించినా అదెక్కడా లేకపోవడంతో వైసీపీ కంగుతిన్నట్లయింది.

సామాజిక కోణంలో..

- కోనసీమలో 4 స్థానాల్లో టీడీపీ అభ్యర్థుల ప్రకటన
- మిగిలిన మూడు స్థానాలపై ఉత్కంఠ
- టీడీపీ సీనియర్లకే పట్టం కట్టిన అధిష్ఠానం
- గన్నవరం అభ్యర్థి ఎంపికపై కొంతమేర అసంతృప్తి
- సర్దుబాటు చేస్తున్న లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జి హరీష్
- అభ్యర్థుల ప్రకటనపై సంఘీభావాలు.. హర్షాతిరేకాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం ప్రకటించిన తొలి విడత జాబితాలో కోనసీమ జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. సామాజిక సమీకరణలు దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేశారు. అయితే ఒక స్థానంలో మినహా మిగిలిన మూడు స్థానాల్లోను అందరూ ఊహించినట్టే అభ్యర్థుల ఎంపిక జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఇప్పటికి నాలుగు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ఎంపిక చేసింది. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మండపేట నియోజకవర్గం నుంచి టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుల పేర్లు ఖరారు చేసింది. పి.గన్నవరం ఎస్సీ నియోజకవర్గం నుంచి అనూహ్యంగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. ఇక మిగిలిన మూడు స్థానాల్లోను జనసేన రాజోలు ఎస్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుందని ఇప్పటికే ఆ పార్టీ ప్రకటన చేసినందున, అమలాపురం ఎస్సీ రిజర్వుడు, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఏస్థానం నుంచి ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారన్న ఉత్కంఠ నెలకొంది. దాంతో ఆయా పార్టీల నుంచి ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు అటు టీడీపీ, ఇటు జనసేన కార్యాలయాలకు అనుచర గణాలతో తరలివెళ్లారు. పి.గన్నవరం సీటు మహాసేన రాజేష్‌కు ప్రకటించడంతో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన కేడర్ తీవ్రమైన అసంతృప్తికి లోనవుతున్నారు. వారిని బుజ్జగించేందుకు అమలాపురం లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ గన్నవరం వెళ్లినప్పటికీ పార్టీ శ్రేణులు ఆయనకు ప్రశ్నాస్త్రాలు సంధించడంతో ఇరు పార్టీల నేతలను బుజ్జగించే పనిలో ఉన్నారు.

సీనియర్లకు పట్టం కట్టిన టీడీపీ..

కోనసీమలో టీడీపీ ప్రకటించిన నాలుగు స్థానాల్లో సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ప్రకటన జరిగింది కొత్తపేట నుంచి కాపు సామాజికవర్గ నేత బండారు సత్యానందరావుకు టీడీపీ పట్టం కట్టింది. ఆయన ఎనిమిదో సారి రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకోనున్నారు. 1989 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగుతున్న సత్యానందరావు ఇప్పటికి మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. కాగా మండపేట నియోజకవర్గం నుంచి కమ్మ సామాజికవర్గానికి చెందిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా మూడు సార్లు టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఐదో పర్యాయం ఆయన రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకోనున్నారు. ఇక ముమ్మిడివరం నుంచి క్షత్రియ సామాజికవర్గానికి చెందిన దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) 2014-19 మధ్య ఎమ్మెల్యేగా ఎన్నికై 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందారు. ఇప్పుడు మూడోసారి ఎన్నికల బరిలో నిలిచి తన విజయావకాశాలను పరీక్షించుకోనున్నారు. ఇక పి.గన్నవరం నుంచి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన సరిపెల్ల రాజేష్ తొలిసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు.

సంఘీభావాలు.. హర్షాతిరేకాలు..

టీడీపీ ప్రకటించిన తొలి విడత జాబితాలో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో అటు టీడీపీ ఇటు జనసేన పార్టీల నేతల మధ్య సంఘీభావ సమరోత్సవాలు మొదలయ్యాయి. అయితే ఒక పి.గన్నవరం టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ పేరు ప్రకటనపై మాత్రం కొంత అసంతృప్తి నెలకొంది. మండపేటలో టీడీపీ ఎమ్మెల్యేగా వేగుళ్ల పేరు ప్రకటించడంతో ఆ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వీరిద్దరి మధ్య స్నేహపూర్వక కలయికతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. కొత్తపేట టీడీపీ అభ్యర్థి సత్యానందరావు ప్రకటనతో ఆయన కుటుంబ సమేతంగా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, సోదరుడైన బండారు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు సహకరించాల్సింగా కుటుంబ సమేతంగా సోదరుడు శ్రీనివాస్‌ను అభ్యర్థించారు. అయితే అంతకుముందే జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావును కొత్తపేట వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కలిసి మాట్లాడినట్టు సమాచారం. ఈ కలయిక రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణను కలిసేందుకు ప్రయత్నించగా ఆయన అప్పటికే మంగళగిరి వెళ్లినట్టు తెలిసింది. ఇక పి.గన్నవరం అభ్యర్థి సరిపెల్ల రాజేష్ అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో టీడీపీ-జనసేన నాయకుల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, స్థానిక టీడీపీ నాయకులు, డొక్కా నాథ్‌బాబు తదితరులు సమాలోచనలు జరుపుతున్నారు. మొత్తం మీద టీడీపీ అభ్యర్థుల జాబితా ప్రకటనపై ఇరు పార్టీల్లోను హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తీవ్రమవుతున్న ఉత్కంఠ..

ఇక అభ్యర్థులని ప్రకటించని అమలాపురం, రామచంద్రపురం, రాజోలు నియోజకవర్గాల్లో తీవ్రమైన ఉత్కంఠ ఇరు పార్టీల కేడర్‌లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే రాజోలు స్థానం జనసేన పోటీ చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ అభ్యర్థి ఎంపికై కసరత్తు ఇంకా పూర్తి కాలేదు. అయితే కోనసీమ జిల్లా నుంచి మిగిలిన రెండు స్థానాల్లో జనసేనే పోటీ చేస్తుందా లేక ఒక స్థానంలో టీడీపీకి అవకాశం ఉంటుందా అనేది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆయా నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల ఇన్‌చార్జిలు తొలి విడత జాబితాల ప్రకటన వెల్లడైన తర్వాత హుటాహుటిన మంగళగిరిలోని ఇరు పార్టీల కార్యాలయాలకు బయలుదేరి వెళ్లారు. అమలాపురం, రామచంద్రపురంలో ఏ స్థానం జనసేనకు కేటాయిస్తారనే అంశం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది.

సముద్రస్నానానికి తరలివచ్చిన భక్తులు



వైభవంగా చక్రస్నానం



అంతర్వేది తీరానికి పోటెత్తిన భక్తజనం

7లో

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట భద్రతా చర్యలు

ర్యాలీలకు అనుమతి లేదు: ఎస్పీ శ్రీధర్



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. పరీక్ష నేపథ్యంలో ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, నిరసనలకు అనుమతులు లేవన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-2 పరీక్ష జిల్లాలో 33 కేంద్రాల్లో జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఇంటర్నెట్ సెంటర్‌లు, జిరాక్సు షాపులు ఖచ్చితంగా మూసివేసేలా ఆదేశాలిచ్చామన్నారు. జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్టుతో పాటు పరీక్ష సందర్భంగా సెక్షన్ 144 సీఆర్పీసీ అమల్లో ఉందన్నారు. ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు.

భీమేశ్వరునికి వసంతోత్సవం

ద్రాక్షారామలో ఘనంగా వేడుకలు

7లో

పి.గన్నవరంలో భిన్నాభిప్రాయాలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 24: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ప్రకటనపై నియోజకవర్గంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది నాయకులు స్వాగతిస్తుంటే..కొంతమంది మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్‌కుమార్(మహాసేన రాజేష్)ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పలువురు టీడీపీ నాయకుల్లో తీవ్ర అసంపూర్తి నెలకొనగా మరికొంత మంది మాత్రం టీడీపీకే సీటు కేటాయించినందుకు జోష్‌లో ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న తోలేటి సత్తిబాబు తన పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మరికొంతమంది నేతలైతే అభ్యర్థి ఎవరైనప్పటికి చంద్రబాబు మాటే శిరోధార్యమని పార్టీ విజయానికి కృషి చేస్తామని చెబుతున్నారు. ఏపార్టీకి టిక్కెట్ ఇచ్చినా ఓకే కానీ...ప్రస్తుత అభ్యర్థి విషయంలో మరోసారి పునరాలోచించాలని తమ అధినేతకు విన్నవించేందుకు పలువురు జనసైనికులు పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లనున్నట్లు తెలిసింది.



మాట్లాడుతున్న హరీష్‌మాధుర్

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం: హరీష్

అభ్యర్థి విషయంపై క్యాడర్ అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలియజేస్తామని అమలాపురం పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. పార్టీ కార్యాలయం మూసేశామని, పార్టీ నాయకులు అసంతృప్తితో ఉన్నారని మీడియాలో కథనాలు వినిపిస్తున్నాయని అవన్ని అవాస్తవాలని అదే పార్టీ కార్యాలయంలో ఇప్పుడు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొత్తుధర్మం పాటిస్తాం కానీ మహాసేన రాజేష్‌ను సమర్థించలేం: జనసేన నాయకులు

నియోజకవర్గంలో పొత్తుధర్మం పాటిస్తాం...కానీ టీడీపీ అభ్యరిగా ప్రకటించిన మహాసేన రాజేష్‌కు మాత్రం సహకరించే ప్రసక్తే లేదని ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్‌కు స్పష్టం చేశారు.

టీడీపీ, జనసేన అభ్యర్థుల బయోడేటాలు

ఉమ్మడి తూర్పుగోదావరిలో బరిలోకి దిగనున్న అభ్యర్థుల జాబితాను టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించాయి. జాబితాను శనివారం ఉదయం అధికారికంగా వెల్లడించాయి. తొలివిడత జాబితాలో ఉమ్మడి తూ.గో. జిల్లాకు సంబంధించి మొత్తం 11మంది అభ్యర్థుల బయోడేటా వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

నియోజకవర్గం : పెద్దాపురం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : నిమ్మకాయల చినరాజప్ప
వయస్సు : 70
విద్యార్హతలు : ఎం.ఏ
తల్లిదండ్రులు : వెంకట రంగయ్య, కొండమ్మ
భార్య : అనురాధ
కుమారుడు : రంగనాగ్
కుమార్తె : కల్యాణి
స్వగ్రామం : పెదగాడవల్లి, ఉప్పలగుప్తం మండలం

రాజకీయ నేపథ్యం: నిమ్మకాయల చినరాజప్ప 2014 ఎన్నికల్లో పెద్దాపురం నియోజక వర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున గెలుపొంది రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగానూ, హోంమంత్రిగానూ 2019 వరకూ బాధ్యతలు నిర్వహించారు. తదుపరి 2019లో జరిగిన ఎన్నికలలో కూడా రెండవ దఫా తిరిగి పెద్దాపురం నియోజకవర్గం నుంచి అనూహ్యంగా గెలుపొందారు. అంతకుముందు 2007-2013 నాటి కాలంలో శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. 2004-2006 మినహా 1989 నుంచి 2014 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగారు. 1982లో నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలోకి చేరి క్రియాశీలక సభ్యునిగా కొనసాగారు. ఎన్టీఆర్ పార్టీ ప్రకటించినపుడు చినరాజప్ప ఎన్టీఆర్ సమక్షంలోనే ఉన్నారు. 1986లో తూర్పుగోదావరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1987లో ఉప్పలగుప్తం మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995లో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా, 2001లో కెనరా బ్యాంక్ డైరక్టర్‌గా వివిధ పదవులు అధిరోహించారు.

నియోజకవర్గం : జగ్గంపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : జ్యోతుల నెహ్రూ
వయస్సు : 71
విద్యార్హతలు : ఎంఏ (పొలిటికల్ సైన్స్)
తల్లిదండ్రులు : జ్యోతుల నాగేశ్వరరావు, సుబ్బయ్యమ్మ
భార్య పేరు : మణి,
కుమారుడు : జ్యోతుల నవీన్, కోడలు లక్ష్మీదేవి
కుమార్తె : తోట సునీత, అల్లుడు : తోట సర్వారాయుడు

రాజకీయ నేపథ్యం: తొలుత 1981లో రంగంపేట సొసైటీకి పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం మామిడాడ సొసైటీ చైర్మన్‌గా విజయం సాధించారు. జగ్గంపేటలో 1991లో టీడీపీ తరఫున ఉపఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. అనంతరం జగ్గంపేట నుంచే 1994, 1999 సాధారణ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటనరసింహంపై ఓడిపోయారు. తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీచేసి ఓడిపోయారు.

నియోజకవర్గం : తుని

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : యనమల దివ్య
వయస్సు : 39
విద్యార్హతలు : బీటెక్, ఎంబీఏ ఫైనాన్స్(యూకే)
తండ్రి : యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత,
భర్త : గోపీనాథ్ (ఐఏఎస్)
కుమారుడు : రవి
కుమార్తె : జ్యోష్న
స్వగ్రామం : ఏవీ నగరం

రాజకీయ నేపథ్యం: తన తండ్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రోత్సాహంతో రాజకీ యాల్లోకి ప్రవేశించారు. ప్రస్తుతం తుని నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

నియోజకవర్గం : అనపర్తి

పేరు : నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
విద్యార్హతలు : బీఈ సివిల్ ఇంజనీర్
వయస్సు : 58
తల్లిదండ్రులు : నల్లమిల్లి మూలారెడ్డి మాజీ ఎమ్మెల్యే, సత్యవతి దంపతులు
భార్య : నల్లమిల్లి మహాలక్ష్మి
కుమారుడు : నల్లమిల్లి మనోజ్‌రెడ్డి
కుమార్తె : నల్లమిల్లి సనాతిని
నివాసం : రామవరం,అనపర్తి మండలం

రాజకీయనేపథ్యం : 2012 నుంచి అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు. 2014 ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలుపు. 2019 ఎమ్మెల్యేగా ఓటమి. అంతకు ముందు రామకృష్ణారెడ్డి తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి 1983 నుంచి వరుసగా ఏడు పర్యాయాలు టీడీపీ అభ్యర్థిగా పోటీ నాలుగు సార్లు విజయం, మూడుసార్లు ఓటమి.

నియోజకవర్గం : ముమ్మిడివరం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)
తల్లిదండ్రులు : వెంకటసత్యనారాయణరాజు, నారాయణమ్మ
వయస్సు : 51
విద్యార్హతలు : ఇంటర్మీడియట్ (బీపీ)
భార్య : పార్వతి
కుమార్తెలు : స్నేహిత, శ్రావ్య

రాజకీయ నేపథ్యం : 1995లో టీడీపీలో చేరారు. 2004 సంవత్సరంలో మురమళ్ల జడ్పీ హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్‌గాను, 2005 నుంచి 2013 పీఏసీఎస్ అధ్యక్షుడుగాను పనిచేశారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నడింపల్లి శ్రీనివాసరావు ఓటమి చెందడం, ఆ తరువాత ఆయన మృతిచెందడంతో సుబ్బరాజు టీడీపీ బాధ్యతను భుజాన వేసుకున్నారు. 2014లో 29,538 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 5547 ఓట్లతో వైసీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై ఓటమి చెందారు.

నియోజకవర్గం : కొత్తపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : బండారు సత్యానందరావు
తల్లిదండ్రులు : దివంగత బుల్లిసత్యం, చంద్రావతి
వయస్సు : 59
స్వగ్రామం : వాడపాలెం, కొత్తపేట మండలం
కులం : కాపు
విద్యార్హత : బీకాం
భార్య : కమలారాణి
పిల్లలు : సందీప్, సంజీవ్, రమ్య

రాజకీయ నేపథ్యం : 1982లో నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించి పలు పార్టీ పదవులు అలకరించారు. 1989లో శాసనసభ ఎన్నికలకు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 1994, 1999లలో టీడీపీ శాసనసభ్యుడిగా విజయం సాధించారు. 2004లో స్వల్పతేడాతో ఓటమి చెందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో టీడీపీ తరుపు పోటీ చేసి ఓటమి చెందారు. 2024లో 8వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. శాసనసభ్యుడిగానే కాకుండా అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యునిగా, పీఆర్పీ శాసనసభ ఉపనాయకుడిగా పనిచేశారు.

నియోజకవర్గం : పి.గన్నవరం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : సరిపెల్ల రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)
వయస్సు : 43
విద్యార్హతలు : బి.కాం
తండ్రి పేరు : సరిపెల్ల సాధుసుందర్‌సింగ్
తల్లి పేరు : స్వర్ణలక్ష్మి (మాజీ ఉపసర్పంచ్ ఉత్తరకంచి)
భార్య పేరు : హరిక,
పిల్లలు : సంజనషోబిత, మధుహాషిని
నివాసం : ఉత్తరకంచి, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా

రాజకీయ నేపథ్యం: 2017లో మహాసేన అనే సంస్థను స్థాపించి అనంతరం 2018లో జగన్మోహనరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. అలాగే వైసీపీలో జరిగిన పలు పరిణామాలతో కొద్దికాలానికే బయటకు వచ్చేశారు. 2022లో సామర్లకోటలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మూడేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై మహాసేన సోషల్ మీడియా వేదికగా పోరు సాగిస్తున్నారు.

నియోజకవర్గం : మండపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : వేగుళ్ల జోగేశ్వరరావు
వయస్సు : 69
విద్యార్హతలు : బి.కాం
తల్లిదండ్రులు : సర్దార్ వేగుళ్ల వీర్రాజు, మాణిక్యాంబ
భార్య పేరు : విజయలక్ష్మి,
కుమార్తెలు : మణిమంజరి, సాయిసుమన
నివాసం : పాటిమీద, కేపీ రోడ్డు, మండపేట

రాజకీయ నేపథ్యం : 1989లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. 1999లో టీడీపీలో చేరారు. తొలిసారిగా మండపేట మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ తరఫున పోటీచేసి 2000వ సంవత్సరంలో విజయం సాధించారు. 2004లో ఆలమూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున స్వల్ప మెజార్టీతో ఓటమిపాలయ్యారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం 2009లో ఏర్పడింది. మండపేట అసెంబ్లీ నుంచి టీడీపీ తరఫున 2009, 2014, 2019లలో మూడుసార్లు వరుసగా టీడీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు. ఇప్పుడు మరోసారి 2024లో జరిగే ఎన్నికల్లో నాల్గవసారి పోటీకి సై అంటున్నారు.

నియోజకవర్గం : కాకినాడ రూరల్

పార్టీ : జనసేన
అభ్యర్థి పేరు : పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)
తండ్రి : పంతం సుబ్బారావు,
వయస్సు : 62
విద్యార్హతలు : డిగ్రీ
కులం : కాపు సామాజికవర్గం
భార్య పేరు : అరుణ, పదో తరగతి
కుమారుడు పేరు : పంతం సందీప్, బీటెక్, ఎంబీఏ
వ్యాపారం : రియల్ ఎస్టేట్
స్వగ్రామం : గెద్దనాపల్లి, కిర్లంపూడి మండలం
నివాసం : గొడారిగుంట, కాకినాడ

రాజకీయ నేపథ్యం : కాంగ్రెస్ పార్టీలో కాకినాడ సిటీ అధ్యక్షుడుగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా, ఏపీసీసీ కార్యదర్శిగా పనిచేశారు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కాకినాడ సిటీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. జనసేనలో 2018లో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులుగా, కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీచేసి 39,247 ఓట్లు సాధించారు.

నియోజకవర్గం : రాజమహేంద్రవరం సిటీ

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)
తండ్రి పేరు : ఆదిరెడ్డి అప్పారావు మాజీ ఎమ్మెల్సీ,
తల్లి పేరు : వీరాఘవమ్మ,రాజమహేంద్రవరం మాజీ మేయర్
భార్య పేరు : ఆదిరెడ్డి భవాని, ప్రస్తుత సిటీ ఎమ్మెల్యే
కుమారుడు : ఆదిరెడ్డి జయేష్‌నాయుడు (8వ తరగతి)
విద్యార్హతలు : బీఈ (మద్రాస్ యూనివర్సిటీ)

రాజకీయ నేపథ్యం : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, రాజమహేంద్రవరం నియోజకవర్గ ఇన్‌చార్జి. రాజమహేంద్రవరం నగరం కేంద్రంగా పార్టీ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన మహానాడు, చంద్రబాబు అరెస్టు సమయంలో జరిగిన ఆందోళనలకు కీలకపాత్ర వహించారు.

సామాజిక సేవలు : భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏడాదికి వంద మంది పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేయడం, పేదలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం, పేద క్రీడాకారులకు క్రీడా పరికరాల కోసం ఆర్థిక సాయం, మొబైల్ అన్నా క్యాంటీన్లు నగరంలో పలుచోట్ల ఏర్పాటుచేసి పేదలకు భోజనాలు పెట్టడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గం : రాజానగరం

పేరు : బత్తుల బలరామకృష్ణ
తండ్రిపేరు : బత్తుల గంగారావు
స్వస్థలం : గాదరాడ, కోరుకొండ మండలం
కులం : ఓసీ(కాపు)
వయసు : 49
చదువు : 10వ తరగతి , బి.కాం (డిస్కంటిన్యూ)
భాషలు : తెలుగు, ఇంగ్లీషు
భార్య : బత్తుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ
కుమార్తెలు : బత్తుల ప్రత్యూషదేవి, బత్తుల వందనాంబిక వివాహిత, వ్యాపారం
అల్లుడు : తోట పవన్‌కుమార్, వ్యాపారవేత్త
కుమార్తె : బత్తుల వందనాంబిక(బీబీఏ విద్యార్థి, భూస్వామి)

రాజకీయ నేపథ్యం: రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ రాజకీయాలకు కొత్త. సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ వివిధ వ్యాపారాల్లో ఉన్నారు. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన ఆయన ఒకే ప్రాంగణంలో 54 దేవాలయాలను నిర్మించి ఆధ్యాత్మికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఓంశక్తి పీఠం నిర్వహిస్తున్నారు. గతఎన్నికలలో వైసీపీకి పనిచేశారు. తర్వాత ఆయన సతీమణి వైసీపీ తరఫున ఎంపీటీసీగా గెలిచారు. కానీ తర్వాత వైసీపీ నేతలతో విభేదాలవల్ల జనసేనలో చేరి టిక్కెట్టు తెచ్చుకున్నారు.

రాజమహేంద్రవరంలో సీఎంఆర్ జ్యూయలరీ షోరూం ప్రారంభం

రాజమహేంద్రవరం, కల్చరల్, ఫిబ్రవరి 24: సీఎం ఆర్ షోరూంలో నూరుశాతం బీఐఎస్ హాల్‌మార్క్ ఆభరణాలు లభిస్తాయని ప్రముఖ కాంట్రాక్టర్, బిల్డర్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అతిపెద్ద గ్రూప్ సీఎంఆర్ టెక్స్ టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి తమ ఎక్స్‌క్లూజివ్ జ్యూయలరీ షోరూంను శనివారం రాజమహేంద్రవరం కందకం రోడ్‌లో ప్రారంభించారు. షోరూం ప్రారంభోత్సవ స్పెషల్ ఆఫర్‌గా గ్రాము బంగారంపై రూ.250 వరకు తగ్గింపు మార్చి 10వ తేదీ వరకు ఉంటుందని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తెలిపారు. సులభతరమైన బంగారం కొనుగోలు పథకం ఉందన్నారు. వ్యక్తిగత ఆర్డర్‌పై కస్టమర్స్ అభిరుచులకు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీఘాకోళపు తదితరులు

అనుగుణంగా జ్యూయలరీ తయారు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కంటిపూడి సర్వారాయుడు, ఆర్.సుబ్బరాజు, డీవీబీ.రాజు, చందన నాగేశ్వర్, చెరుకూరి వీర్రాజు, అక్కిన మునికోటేశ్వరరావు, చెరుకూరి కృష్ణాజీ, డాక్టర్ పద్మజ, కె.ప్రభాకర్ షోరూమ్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

ఆహ్లాదంగా భీమేశ్వరుని వసంతోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపు రం మండలం ద్రాక్షారామ భీమేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి వసంతోత్సవం ఆనందోత్సాహంతో జరిగింది. అదేవిధంగా త్రిశూ ల, శ్రీచక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం వేగాయమ్మపేట ఆస్థాన మండపంవద్ద నుంచి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామివార్లను రథంపై ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు జరిగాయి. తదుపరి మండపారాధన, నాకబలి పూజలు ఆగమ పండితులు దేవులపల్లి ఫణి రామకృష్ణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంత రం వసంతోత్సవం జరిగింది. కల్యాణమూర్తులైన స్వామి,అమ్మవార్లకు వసంతాలు చల్లారు. అనంతరం అర్చక స్వాములు కల్యాణమూర్తులను చేతపట్టి వసంతాలు జల్లుకున్నారు. మంగళవాయిద్యాలకు అనుగుణంగా లయ బద్ధంగా నృత్యంచేస్తూ దండాడింపు, వసంతోత్సవం ఆహ్లాదంగా జరిగాయి.


సప్తగోదావరిలో త్రిశూల శ్రీచక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

తదుపరి సప్తగోదావరినదిలో త్రిశూల, శ్రీచక్రస్నానం అర్చకస్వాములు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు త్రిశూల, శ్రీచక్రస్నానం కార్యక్రమంలో పా ల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా నరసన్న చక్రస్నానం

● చక్రపెరుమాళ్ స్వామికి ప్రత్యేక పూజలు, ● పోటెత్తిన భక్తజనసంద్రం

అంతర్వేది, ఫిబ్రవరి 24: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 7గంటలకు ఆలయంవద్ద నుంచి అలంకార మండపంలో అర్చకుల పూజలందుకున్న స్వామివారు రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడపుష్పక వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళవాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి జగన్నాథాచార్యులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి, పేరూరు ఉద్దండ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్, ఆలయ సహాయకమిషనర్ వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, తహశీల్దార్ రమాకుమారి, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, పోతురాజు శ్రీవేంకటకృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, డీఎస్పీ రమణ, ఎస్‌ఐ ఎస్.రాము, వాహనకారులు, భక్తులు తదితరులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలుత పేరూరు ఉద్దండ పండితుల శిరస్సుపై శ్రీ చక్రపెరుమాళ్‌ను ఉంచి సముద్ర స్నానం చేశారు. స్వామితో పాటు అధిక


భక్తుల మధ్య చక్రపెరుమాళ్‌కు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, అగ్నికుల క్షత్రియులు పున్నమి స్నానాలు ఆచరించారు. మాఘ పౌర్ణమి కావడంతో సముద్ర తీరమంతా భక్తులతో కళకళలాడింది. జల్లుస్నానం రద్దు చేయడంతో వార్షికస్నానాలు చక్రపెరుమాళ్‌తో సముద్రంలోనే స్నానాలు ఆచరించారు. అనంతరం పూజలు అందుకున్న స్వామి, చక్రపెరుమాళ్‌ను వసంత మండపానికి అర్చకులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామికి నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదం పంచారు. రాత్రి అర్చకులు ధ్వజావరోహణ నిర్వహించారు.

నేడు స్వామివారి తెప్పోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 24: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణో త్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, తిరువా రాధన, బాలభోగం, సాయంత్రం 5గంటలకు అప్పనపల్లి వాస్తవ్యు లు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యే శ్వరరావు వారిచే నిర్మితమైన పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు చివరి ఘట్టమైన శ్రీస్వామివారి తెప్పోత్సవం గ్రామచెరువులో మిరుమి ట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలతో చేసిన హంసవాహనంపై బ్రాహ్మండమైన బాణాసంచా కాల్పులతో వెంప వాస్తవ్యులు గొట్టుముక్కల భీమరాజు సహకా రంతో తెప్పోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు తిరుమంజనములు, దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, శ్రీస్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా అంతర్‌జిల్లాల

ఖోఖో పోటీలు ప్రారంభం


వివిధ జిల్లాల ఖోఖో క్రీడాకారుల కవాతు ప్రదర్శన

సామర్లకోట, ఫిబ్రవరి 24: కాకినాడజిల్లా సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల సీనియర్స్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహభరితమైన వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ఖోఖో క్రీడాకారులతో బాటూ ఉద్యోగుల సంఘం తరపున ఒకటి చొప్పున మొత్తం 14 జిల్లాల నుంచి 28 జట్లు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సంఘం ఆద్వర్యంలో శనివారం నుంచి 3 రోజుల పాటు పగలు, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రి సమయాలలోనూ ఈ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు ఊబా జాన్ మోజెస్, కె.పట్టాభిరామంలు చెప్పారు. ఈపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షులు టీఎస్‌ఆర్‌కె ప్రసాదరావు, పోతుల సాయిబాబులతో బాటూ పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర లేబర్ సెల్ నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జీఅరుణ, పీఈటీ యార్లగడ్డ బంగార్రాజు, ఎం.వెంకటేశ్వర్లు, ఎండీవీ. ప్రసాద్, తదితర కౌన్సిలర్లు, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభ వేడుకలలో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఖోఖో క్రీడాకారులతో చేసిన పతాక వందనను స్వీకరించారు.


హోరాహోరీగా సాగుతున్న ఖోఖో పోటీలు

భక్తజనసంద్రంగా సత్యదేవుడి సన్నిధి

● 7311 వ్రతాలు, రూ.70 లక్షల ఆదాయం


సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 24: సత్యదేవుడి సన్నిధి శనివారం మాఘపౌర్ణమి పర్వదినం సందర్భంగా అశేష భక్తజనంతో పోటెత్తింది. శుక్రవారం రాత్రికే రత్నగిరికి చేరుకున్న భక్తులకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండుగంటల నుంచి వ్రతాలు మూడుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. శనివారం ఒక్కరోజు 7311 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.70లక్షల ఆదాయం సమకూరింది. రద్దీ నేపథ్యంలో అంత్రాలయ ప్రదక్షిణ దర్శనాలు నిలుపుదల చేశారు. ఎక్కడికక్కడ క్యూలైన్‌లలో భక్తులకు మంచినీటి సదుపాయం కల్పించారు. ఎండలు మండుతుండడంతో షామియానాలు పూర్తిస్థాయిలో లేక భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఈవో రామచంద్రమోహన్ సమీక్షించారు.

జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి నిరసన


స్పృహతప్పి పడిపోయిన పాఠంశెట్టి

గోకవరం/ జగ్గంపేట, ఫిబ్రవరి 24: టీడీపీ జనసేన ఉమ్మడి జాబితాలో జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే సీటును టీడీపీ జ్యోతుల నెహ్రూకు కేటాయించడంతో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర మనస్తాపానికి గురయ్యారు. తాను సామాన్యుడిగా పుట్టినందుకే సీటు నిరాకరణకు గుర య్యానని అన్నారు. తన చావుతో ఎమ్మెల్యే సీటు ఆశించే సామాన్య అభ్యర్థులకు కనువిప్పు కలగాలన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయంలో భాగంగా జగ్గంపేట మండలం గూనాడ నుంచి కార్యకర్తలతో పాదయాత్ర చేసుకుంటూ గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో బలవన్మరణానికి పాల్పడతానంటూ తన భార్యతో కలిసి బయలుదేరారు. నా భార్య ఇష్టదేవత దుర్గమ్మ గ్రామంలో ఉండడంతో అక్కడ తనువు చాలిస్తానన్నారు. సూర్య చంద్ర తీసుకున్న నిర్ణయం చట్టవ్యతిరేకమంటూ పోలీసులు ఆయన పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆయన పాదయాత్ర కొనసాగిస్తూ గోకవరం మండలం పెంటపల్లి వరకూ చేరుకున్నారు. అక్కడ ఆయన పాదయాత్ర అడ్డుకునేందుకు పోలీసులుచుట్టుముట్టారు. దీంతో ఆయన పక్కదారి గుండా అచ్యుతాపురం చేరేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో పోలీసులు.. ఆయనకు మధ్య జరిగిన పెనుగు లాటలో సూర్యచంద్ర స్పృహతప్పి పడిపోయారు. కార్యకర్తలు సపరిచర్యలు చేసిన కొద్దిసేపటికే మేల్కొని మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన దేవుడంటూ కొనియాడారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని శిరసా వహిస్తానన్నారు. కానీ 2019నుంచి తాను ప్రజల్లో తిరుగుతూ జనసేన పార్టీని ఎంతో బలోపేతం చేశాన న్నారు. కానీ సీటు నిరాకరణకు గురవడంతో తన ఆశయం నీరుగారిపోయిందన్నారు. అందుకే నా అంతిమ ఆమరణ దీక్షకు పూనుకోవడం జరిగిందన్నారు. పాదయాత్ర నేపథ్యంలో సుమారు 100 పోలీసులు పాదయాత్ర వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్..

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24: టీడీపీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు విద్యార్థి మేలుకో.. భవిష్యత్తును కాపాడుకో.. మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం యువతను నిలువునా ముంచిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని ఆరోపించారు.

టీడీపీ ముమ్మిడివరం, కొత్తపేట అభ్యర్థులుగా దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు ప్రకటనపై సంబరాలు చేసుకున్న నాయకులు

చంద్రబాబు, పవన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి



భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 24: టీడీపీ, జనసేన పార్టీ నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనతో విసిగి చెందిన ప్రజలు టీడీపీ, జనసేన ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. స్థానిక 28,29,30వార్డుల్లో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వేగుళ్ల స్థానిక టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకుని, ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వార్డు ఇన్‌చార్జిలు పెదపాటి సత్తిబాబు, షేక్ ఖరీం, గుత్తుల సత్తిబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, వల్లూరి ఇందిరారాణి, వేమగిరి మోషే, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కొవ్వాడ అప్పన్నబాబు, చాపల వీరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేగుళ్లకు మండపేట సీటు కేటాయించడంతో సంఘం కాలనీలో టీడీపీ శ్రేణులు వేగుళ్లతో కేక్‌కట్ చేయించి వేగుళ్లకు తినిపించారు. స్వీట్స్ పంచారు. వేగుళ్లను శాలువాతో సత్కరించారు. సంఘం కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరారు.పార్టీలో చేరిన సత్తి ధనుంజయరెడ్డి, వానపల్లి సత్యవతి, వానపల్లి రాజ బాబు, సత్తి సత్యవతిలకు కండువాలు కప్పి పార్టీలోకి వేగుళ్ల ఆహ్వానించారు.

జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణను కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల



కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 24: టీడీపీ మండపేట నియోజకవర్గం అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ అధిష్టానం ప్రకటించడంతో వల్లూరులో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణను శనివారం వేగుళ్ళ కలిసారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేయాలని లీలాకృష్ణను వేగుళ్ల కోరారు. ఈసందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి సాగనంపేందుకు కలిసి పనిచేస్తానని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వల్లూరి వీరబాబు, గుణ్ణం సుబ్బరాజు, వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

భక్తజనంతో పోటెత్తిన వెంకన్న క్షేత్రం



ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని తలనీలాలు, తులభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవిందనామస్మరణతో అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.39.85 లక్షలు లభించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో, డీసీబీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

శనేశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, ఫిబ్రవరి 24: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో భక్తులు శనివారం విశేష సంఖ్యలో విచ్చేశారు. స్వామివారి సర్వదర్శనముల అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.250,208 ఒక్కరోజు ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన పాలూరి రామకృష్ణ-మాణిక్యాంబ దంపతులు అన్నప్రసాద విరాళం రూ.1,00,116 సమర్పించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒంగోలు వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేద పండితుల ఆశీర్వచనం అందించారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, ఫిబ్రవరి 24: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 4,961మంది భక్తులు దర్శించుకుని నిత్యాన్నదాన పథకంలో 3,285మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ అర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం రూ.2,94,271 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు.

రైతులపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వ తీరుకు నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం, రైతు సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24: ఢిల్లీలో రైతులు చేపట్టిన పోరాటానికి మద్దతు తెలపడంతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కనీస మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న రైతులపై హరియాణా పోలీసులు దాడిచేసి శుభకరణ్‌సింగ్ మృతికి కారకులయ్యారని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను చంపడం దుర్మార్గమని, ప్రజాస్వామ్యవాదులంతా ఇటువంటి ఘటనలు ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఉద్యమానికి తలొగ్గి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దుచేసినా మరొక రూపంలో వాటిని అమలు చేస్తుందని ధ్వజమెత్తారు. 1.50లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు బలవర్మణానికి పాల్పడ్డ మోదీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. సీపీఎం నాయకులు భాస్కరరావు, విప్పర్తి మోహనరావు, సబ్బతి రాంబాబు, లక్ష్మణరావు, డి.సత్యనారాయణ, బుంగ సత్యనారాయణ, టి.సత్యనారాయణ, ఎస్.మేరీ, నాయకులు కె.కృష్ణవేణి, గుదే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు





ముమ్మిడివరం: ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు, రావులపాలెం: బండారును కలిసి అభినందలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24: తెలుగుదేశం పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థిగా దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)ను ప్రకటించడంతో ముమ్మిడివరంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పోలమ్మ చెరువుగట్టున ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపించి విజయం చేకూర్చాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. కొండాలమ్మ చింత సెంటర్‌లో రెడ్డి బాలకృష్ణ స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ కట్‌చేసి పంచారు. దొమ్మేటి రమణకుమార్, ములపర్తి బాలకృష్ణ, విళ్ల వీరాస్వామినాయుడు, పితాని నరసింహమూర్తి, యాళ్ల ఉదయ్, యేడిద శివ, కట్టా సత్తిబాబు, మట్టపర్తి లోకేష్, రెడ్డి వీరబాబు, కాశి లాజర్, రెడ్డి రాజ్‌కుమార్, రెడ్డి నాగేశ్వరరావు, మాదాల పరంకుశం, ఎస్‌వీఎస్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చిబాబుకు టీడీపీ అభ్యర్థిత్వంపై హర్షం

కాట్రేనికోన, ఫిబ్రవరి 24: టీడీపీ ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును పార్టీ అధిష్టానం ప్రకటించడంతో తెలుగుదేశం పార్టీలో హర్షం వ్యక్తమైంది. బుచ్చిబాబును కలిసి పార్టీ మండల నాయకులు అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జొన్నాడ రాజారావు, సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, గుత్తుల సూరిబాబు, మోకా లోవరాజు, గుబ్బల చంద్రరావు, బొక్కా చిన్న పాల్గొన్నారు.

అభ్యర్థిగా బండారు ప్రకటనపై హర్షం

రావులపాలెం, ఫిబ్రవరి 24: కొత్తపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన అభ్యర్థిగా బండారు సత్యానందరావు పేరు ప్రకటించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో బండారును పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. బండారుకు టిక్కెట్టు ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా వీరభద్రుడి సంబరం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24: ముమ్మిడివరంలోని గణేశులవారి వీరభద్రుడి సంబరం శనివారం వైభవంగా నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా వీరభద్రుని బోణాలు పోసి సంబర మహోత్సవాలు నిర్వహించారు. వీరభద్ర కాంప్లెక్సు నుంచి విబూది పండ్లను పల్లకీలో ఊరేగింపుగా మేళతాళాలు, బాణసంచా కాల్పులతో షిర్డిసాయి మందిరం వరకు తీసుకువెళ్లి పవిత్ర జలాల్లో స్నానాలు ఆచరించి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. ఈసందర్భంగా తాడి నరేష్ వెండి కలశం, దీపారాధన కుందులు, యేడిద భాస్కరరావు, వరలక్ష్మి దంపతులు వెండి త్రిశూలం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణేశుల బ్రహ్మానందం, అతని సోదరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోదశి నాగేశ్వరరావు, ధూలిపూడి చక్రం, వేగిరౌతు రాజబాబు, కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, మహిళా కళాశాల విద్యార్థినులు, నగర పంచాయతీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో సంబరం

మామిడికుదురు, ఫిబ్రవరి 24: వీరభద్రస్వామి సంబరాన్ని అప్పనపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. వైనతేయ నది వరకు మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ నృత్యాలు చేస్తూ స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి అక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. స్థానిక తులా గోపాలకృష్ణ-నాగసూర్యావతి దంపతులతో పాటు కంకిపాటి హేమంత్‌నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో సంబరం జరిగింది. గ్రామంలోని సాయివీరభద్రస్వామి ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, శమీపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనల్లో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో

మలికిపురం, ఫిబ్రవరి 24: విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ వేడుకలు ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ అందరినీ ఆలోచింపచేసింది. 8వ తరగతి విద్యార్థినీ వీబీ సాధిక తయారుచేసిన రైల్వే రక్షణ ప్లాట్‌ఫామ్ నమూనా ఆకట్టుకుంది. మానవ అస్థిపంజరం తయారు చేసిన శ్రావణి హర్షిత, ఎముకల సంఖ్య 300 అని, అయితే పిల్లల శరీరం ఎదుగుతున్న కొద్దీ ఎముకలు ఒకదానితో ఒకటి కలిసిపోయి పెద్దయ్యాక 208ఉంటాయని వివరిస్తూ మానవ అస్థిపంజరం గురించి తెలిపారు. చంద్రయాన్-3, స్పీడ్ బ్రేకర్ వద్ద విద్యుత్ ఉత్పత్తి, ఆటోమెటిక్ సెలైన్, కంప్యూటర్ అలారం, పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం, వివిధ రాష్ట్రాల ఆచారాలు, పండుగలు తదితర అంశాలు ఆకట్టుకున్నాయి. 200అంశాలను ప్రదర్శనలో ఉంచారు.సైన్స్ ఫెస్ట్‌ను సీహెచ్‌హెలీనాప్రారంభించగా ఎంఈవో ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఆర్.సుబ్రహ్మణ్యం, కేవీవీ సత్యనారాయణ, నల్లి శివ, మురళీకృష్ణ, సహదేవ్ పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం విడుదల చేయండి: మల్లాడి



ఓఎన్జీసీ ఈడీ కుమార్‌కు ప్రభుత్వ లేఖను అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, ఆర్‌పి మునిస్వామి

యానాం, ఫిబ్రవరి 24: యానాం మత్స్యకారులకు ఓఎన్జీసీ నుంచి రావలసిన పరిహారం తక్షణం ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు ఆర్‌పి మునిస్వామి, మత్స్యశాఖాధికారి దడాల గొంతయ్య నేతృత్వంలో శనివారం కాకినాడలోని ఓఎన్జీసీ ఈడీ రత్నేష్ కుమార్‌తో సమావేశమయ్యారు. పుదుచ్చేరి గవర్నర్, ప్రభుత్వం నుంచి తీసుకువచ్చిన పత్రాలను అధికారులకు అందజేశారు. అనంతరం వివిధ అంశాలపై ఇద్దరు చర్చించుకున్నారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ పరిహారానికి సంబంధించి ప్రభుత్వ అన్ని చర్యలు పూర్తిచేసిందని, గవర్నర్ నుంచి అన్ని అనుమతులు ప్రభుత్వం తీసుకుని ఓఎన్జీసీకి అందజేసిందన్నారు. పరిహారానికి సంబంధించి గవర్నర్, ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాలను ఓఎన్జీసీకి అందజేశామన్నారు. ప్రభుత్వం 5,289 మంది అర్హులైన మత్స్యకారుల జాబితాను సిద్ధం చేసిందని, వాటిని ఓఎన్జీసీ అందజేశామన్నారు. ఆలస్యం చేయకుండా పరిహారం మొత్తం ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని కోరారు. ఓఎన్జీసీ పరిహారం జమచేసిన మూడు రోజుల్లో 5,289 మంది లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాల్లో పరిహారం జమఅయ్యేల చర్యలు తీసుకుంటామని మల్లాడి తెలిపారు.

173 మందికి న్యాయం చేస్తాం

యానాం నియోజకవర్గంలో 5,462మంది మత్స్యకారుల్లో 173మంది కార్మిక శాఖలో పేర్లు నమోదైనందున వారికి అనర్హులుగా ప్రకటించి మిగిలిన 5,289మందినే అర్హులుగా ప్రకటించారని మల్లాడి అన్నారు. 173మంది యాక్టివ్ ఫిషర్‌మెన్స్ అని, వారికి అన్ని ఆధారాలున్నాయని చెప్పడంతో రెండో దశలో వారికి ప్రభుత్వం అనుమతి ఇస్తుందన్నారు. 173మందికి న్యాయం చేస్తానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యాక్టివ్ ఫిషర్‌మెన్‌గా ఆధారాలు అందజేస్తే మూడురోజుల్లో ఫైల్‌ను తీసుకునివెళ్లి ప్రభుత్వానికి అందజేస్తానని మల్లాడి తెలిపారు.

కోనసీమ తిరుమల వెంకన్న ఆలయంలో బండారు పూజలు



కుటుంబ సభ్యులతో వేద ఆశీర్వచనం అందుకుంటున్న బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి కొత్తపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. బండారు సత్యానందరావుతో పాటు భార్య కమలారాణి, కుమారులు, కుమార్తె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. టీడీపీ జనసేన ప్రకటించిన తొలి జాబితాలో సత్యానందరావును ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈసందర్భంగా బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ప్రకటించడంతో స్వామివారి ఆశీస్సులు పొందడానికి కుటుంబ సభ్యులతో వచ్చినట్లు ఆయన తెలిపారు.

జనసేన ఇన్‌చార్జ్‌ను కలిసిన బండారు

కొత్తపేట, ఫిబ్రవరి 24: కొత్తపేట అసెంబ్లీ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బండారు సత్యానందరావును ప్రకటించగానే తన సోదరుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌ను సత్యానందరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి మాట్లాడారు. బండారు శ్రీనివాస్ తన సోదరుడైన సత్యానందరావుకు శుభాకాంక్షలు తెలిపి ఇరువురు కుటుంబ సభ్యులు మాట్లాడుకున్నారు.

కొత్తపేట టీడీపీ కార్యాలయంలో సంబరాలు...

టీడీపీ, జనసేన కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థిగా బండారు సత్యానందరావు పేరును చంద్రబాబునాయుడు ప్రకటించగానే స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో జనసైనికులతో కలిసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి24: 2024-25ఏడాదికి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం 25శాతం ఉచిత సీట్లు కేటాయించిందని ఎంఈవో కె.హెలీనా తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద గ్రామసచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలోఆమె మాట్లాడారు. మార్చి14వరకు సమీప గ్రామసచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు.

అర్హులందరికీ విశ్వకర్మ యోజన వర్తింపచేయాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 24: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని వర్తింప చేయాలని యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యిళ్ల సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పానుగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. ఆత్రేయపురం సర్పంచ్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ దరఖాస్తులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, దూడల శంకరనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పొందాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23: ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతున్నా, ఇంకా గ్రామాలు, పట్టణాల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని మేజిస్ట్రేట్ హిమబిందు పేర్కొన్నారు. చట్టాలను తెలుసుకోవడం ద్వారా ఎన్నో విజయాలను సాధించడంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.మనోహర్ అధ్యక్షతన శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పురపాలక సంఘ చట్టాల గురించి ఆమె వివరించారు. న్యాయవాదులు వెంపరాల భాస్కరశాస్త్రి, కముజు శ్రీనివాసరావు, ఎల్.భార్గవి, వర్రే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై తాటాకిల్లు దగ్ధం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 24: ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న మద్దింశెట్టి రాంబాబు అదే ఇంట్లో హోటల్‌ను కూడా నడుపుతున్నాడు. శనివారం తెల్లవారుజామున గ్యాస్‌లీకై ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి కె.మురళీకొండబాబు తెలిపారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని మంత్రి విశ్వరూప్, వైసీపీ నాయకులు కుడుపూడి బాబు, అడపా సుబ్రహ్మణ్యం, పొలమూరి బాలకృష్ణ, బొంతు గోవిందుశెట్టి, దంగేటి రుద్రప్రసాద్, ఊటాల ఉదయ్, కడిమి బ్రహ్మాజీ తదితరులు సందర్శించి ఆర్థికసాయంతో పాటు వంట పాత్రలు, బియ్యం అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబుతో పాటు కడిమి చినబాబు, అడపా ప్రకాశ్ తదితరులు బాధితులను పరామర్శించి సాయం అందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: సుందరం మాస్టర్
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: సిద్ధార్థరాయ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ముఖ్య గమనిక
రమా	: గుంటూరు కారం
గణపతి	: ఐ హేట్ లవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	:ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు

సుభాష్‌కు టీడీపీ టిక్కెట్ ఇస్తే రాజీనామాలు చేస్తాం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24: టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గం అభ్యర్థిగా వాసంశెట్టి సుభాష్‌ను ప్రతిపాదిస్తేటీడీపీకి రాజీనామాలు చేస్తామని టీడీపీ రామచంద్రపురం మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. శనివారం వేగాయమ్మపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని సుభాష్ వ్యతిరేకించారని, ఆయన దళిత వ్యతిరేకని దళిత నాయకుడు షట్లర్ కర్ణ విమర్శించారు. రెడ్డి సుబ్రహ్మణ్యంకు పార్టీ టిక్కెట్ కేటాయించాలని వారు కోరారు. మాజీ సర్పంచ్ కాళా భీమశంకరం, కడియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొబ్బరి వృక్షమిత్రలకు శిక్షణ

అంబాజీపేట, ఫిబ్రవరి 24: కోనసీమలో కొబ్బరి దింపు కార్మికుల సమస్యను అధికమించేందుకు సీడీబీ ఆధ్వర్యంలో కొబ్బరి మిత్రలకు శిక్షణను అందిస్తున్నామని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధకేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ.చలపతిరావు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందిస్తున్న కొబ్బరి వృక్షమిత్రలకు శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ శిక్షకులు క్లైంబింగ్ పరికరం ఉపయోగించి కొబ్బరి చెట్లు ఎక్కే నైపుణ్యాన్ని వివరించామన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.అనూష, డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, శిక్షకులు ఇ.వెంకటేశ్వరరావు, పి.సోమశేఖర్, ఇ.వెంకటేశ్వరరావు, ఏఈవో పి.శవికళ పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు టీవీ రామకృష్ణ మృతి



కొత్తపేట, ఫిబ్రవరి 24: కొత్తపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు రామకృష్ణ హాస్పటల్స్ అధినేత టీవీ రామకృష్ణ(75) శనివారం మృతిచెందారు. ఈయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు దంత వైద్యుడిగా పనిచేస్తుండగా అల్లుడు ఒడిసా క్యాడర్‌లో ఎస్పీగా పనిచేస్తున్నారు. 40ఏళ్ల పాటు సుదీర్ఘ వైద్య సేవలు అందించారు. ఈయన మృతికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు, రామచంద్రపురం టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 24: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం హైకోర్టు జడ్జి ఎన్.హరినాథ్ దంపతులు విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అంతనం వేదపండితులు మహదాశీర్వచనం ఇచ్చారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 24: భీమనపల్లి పంచాయతీ పరిధిలో రూ.2కోట్లతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, భీమనపల్లి సచివాలయం-2 భవనాన్ని శనివారం మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. సచివాలయం-2 పరిధిలో వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని ప్రారంభించారు. భీమనపల్లి పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సొసైటీ చైర్మన్ శిరంగు సత్తిరాజు, ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మానే శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు ప్రారంభం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 24: సీహెచ్ గున్నేపల్లి శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతర మహోత్సవాల తొలిరోజు శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిలిపి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణమంతా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మహిపాలచెరువు, పల్లంకుర్రు రోడ్డులో భారీ స్వాగత ద్వారాన్ని ఏర్పాటుచేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా దేవతామూర్తుల ఆకృతులతో భారీ సెట్టింగు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు.

రాజేష్‌కు టిక్కెట్ కేటాయింపుపై అసంతృప్తి

అంబాజీపేట, ఫిబ్రవరి 24: స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్‌శనివారం రాత్రి టీడీపీ మండల నేతలతో సమావేశమయ్యారు. టీడీపీ పి.గన్నవరం టిక్కెట్ మహాసేన రాజేష్‌కు కేటాయించడంపై టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి అభ్యర్థిని మార్పుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని హరీష్‌కు సూచించారు. ఈవిషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని, అప్పటివరకు టీడీపీ శ్రేణులు సమన్వయం పాటించాలని హరీష్ కోరారు. అభ్యర్థిని మార్పు చేసేందుకు పార్టీ నేతలపై చర్చిస్తామని జనసేన నాయకులు తెలిపారు. నాయకులు గణపతి వీరరాఘవులు, చిన్నం బాలవిజయరావు, బొంతు పెదబాబు, గుడాల ఫణి, రవణం రాము, మందా రాజేష్, దొమ్మేటి శ్యామ్, కత్తుల బాబులు, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తా

రామచంద్రపురం, ఫిబ్రవరి 24: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక 24వ వార్డు కుమ్మర్ల వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, రామచంద్రపురం నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, కోలమూరి శివాజీ, వాడ్రేవు సాయిప్రసాద్, పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, బి.సత్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

వివేకానంద స్కూల్‌లో సైన్స్ సంబరాలు

రామచంద్రపురం, ఫిబ్రవరి24:స్థానిక వివేకానంద పాఠశాలలో నిర్వహించిన సైన్స్ సంబరాలు శనివారంతో ముగిసాయి. విద్యార్థులు తయారుచేసిన సృజనాత్మక ప్రయోగాలు సందర్శకులను ఆకర్షించాయి. వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు యాక్టివిటీ బెస్ట్‌అప్లికేషన్ ఓరియంటెడ్ విద్యను అందిస్తున్నామని సంస్థ డైరెక్టర్ బి.ఎ.ఎస్.సరోజిని తెలిపారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్‌శైలూష పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు

మామిడికుదురు, ఫిబ్రవరి 24: ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, లూటుకుర్రులో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, జాలెం రమణకుమారి, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, జాలెం అనూష, కోఆప్షన్ సభ్యుడు నూరేన్‌అబ్బాస్ పాల్గొన్నారు.

చేపలు ఎండబెట్టడంపై అవగాహన సదస్సు

అల్లవరం, ఫిబ్రవరి 24: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో చేపల ఎండబెట్టడంపై ఆధునిక పరికరం ఉపయోగించే విధానంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈపరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం, సైన్సు ఫర్ ఇక్విలిటీ ఎంపర్‌మెంట్, డెవలప్‌మెంట్ సంస్థల ఆర్థిక సాయంతో రూపొందించామన్నారు. డైరెక్టర్ బి.రామన్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ వీఎస్‌ఏ చంద్రమౌళి, డాక్టర్ జి.జనా, డాక్టర్ ఎల్.పి.రాజు, జి.వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, రాజు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వేశ్వరుడికి త్రిశూల స్నానం

అంబాజీపేట, ఫిబ్రవరి 24: మాచవరం పరిధిలోని కోటివారిఅగ్రహారం గ్రామంలో కొలువతీరిన శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా త్రిశూల స్నానాన్ని శనివారం నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి వారి శ్రీపుష్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్‌కు సన్మానం

రాజోలు, ఫిబ్రవరి 24: ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌ను తాటిపాకలో ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి వెండి పూలమాలలతో శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాసు శ్రీనివాస్, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబాలు, యెండూరి రమేష్, లక్కింశెట్టి హరి, లక్కింశెట్టి నానాజీ పాల్గొన్నారు.

కుండలేశ్వరస్వామి కల్యాణం

కాట్రేనికోన, ఫిబ్రవరి 24: కుండలేశ్వరంలో శనివారం పార్వతీకుండలేశ్వర స్వామి, రుక్మిణీసత్యభామాసమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయం వద్ద ఎంపీటీసీ అక్కల శ్రీధర్, డాక్టర్ దుర్గాపావని ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన జరిగింది.ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి నడింపల్లి సూర్యనారాయణరాజు(సూరిబాబు), సర్పంచ్‌లు గంటి వెంకటసుధాకర్, రంబాల రమేష్, గుత్తుల సత్యనారాయణ, చొల్లంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 24: పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. శనివారం కోరుమిల్లిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, ఆర్‌టీకె చైర్మెన్ పుట్టా కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కా సింహాచలం, సలాది అప్పారావు, గ్రామ వలంటీర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

పి.గన్నవరం, ఫిబ్రవరి 24: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చీకరమిల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా నుంచి ధ్రువీకరణపత్రాన్ని అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా గోవిందరాజు

కె.గంగవరం, ఫిబ్రవరి 24: వైసీపీ జిల్లావాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీగా రామచంద్రపురం ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు నియమితుల య్యారు. ఆదివారం అమలాపురంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బా రావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బత్తుల అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ విభాగాల నాయకులు అభినందనలు తెలిపారు.

తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవు

యానాం, ఫిబ్రవరి24:యానాంలో రిక్రియేషన్ పేరుతో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌లకు నిబంధనలు ఉల్లంఘించి తప్పుడు అనుమతులు ఇస్తున్న అధికారులపై చర్యలు తప్పవని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. పుదుచ్చేరికి చెందిన ఫైర్‌సేఫ్టీ అధికారులు పర్యవేక్షణ లేకుండా ఇచ్చిన తప్పుడు అనుమతులపై ఫిర్యాదు చేశామని, పుదుచ్చేరి నుంచి బృందం వచ్చి తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవని మల్లాడి హెచ్చరించారు.

గోడిపాలెం పాఠశాలకు రూ.14.82లక్షలు మంజూరు

అల్లవరం, ఫిబ్రవరి 24: గోడి పంచాయతీ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న గోడిపాలెం పాఠశాల భవన నిర్మాణానికి ఎంపీ చింతా అనురాధ రూ.14.82లక్షల ఓఎన్జీసీ నిధులు మంజూరు చేయించారు. ఈపాఠశాల భవనం శిథిలం కావడంతో ప్రస్తుతం పక్కన ఉన్న రామాలయంలో నడుపుతున్నారు.